పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ : మధుయాష్కీగౌడ్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌కు చెందిన ఐతరాజు రాజు కుమార్తె హర్షిత అనారోగ్య సమస్యలతో నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. వైద్య ఖర్చులు అధిక మొత్తం కావడంతో కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో మధుయాష్కీగౌడ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మంజూరైన రూ2లక్షల 50వేల ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు మధుయాష్కీగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజు తదితరులు పాల్గొన్నారు.



డీసీ సుజాతకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సరూర్‌నగర్ డీసీ సుజాతకు శుభాకాంక్షలు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుజాతను కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్.కె.పురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు రామారావు, వెంకటేశ్వర్లు, తలాటి రమేష్‌నేత, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డికి..



ఏసీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన కాశీరెడ్డిని గురువారం పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ లక్ష్మారెడ్డి, గంట లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయండి

● కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో శుక్రవారం ప్రారంభించనున్న విజయసంకల్ప యాత్రను బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయ సంకల్పయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ కమిటీ సభ్యులు ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరవుతున్నారన్నారు. డివిజన్‌లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఐమాస్ట్‌లైట్‌కు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

ఐమాస్ట్‌లైట్‌కు శంకుస్థాపన

చంపాపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలో గురువారం కార్పొరేటర్ సుజాతానాయక్ ఐమాస్ట్‌లైట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీ, కృష్ణానగర్‌కాలనీ, భూపేష్‌గుప్తానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, నందనవనంలోని వార్డు కార్యాలయం ఎదుట ఐమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్‌కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జితేందర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులతో జగదీష్‌యాదవ్ తదితరులు

కిక్‌బాక్సింగ్, కరాటే విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని తెలంగాణ ఒలింపిక్ జనరల్ సెక్రెటరీ జగదీష్‌యాదవ్ సూచించారు. హైదరాబాద్ శివారు జాఫర్‌గూడ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్, జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో సత్తాచాటారు. కాగా గురువారం తెలంగాణ ఒలింపిక్ భవన్‌లో పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు జగదీష్‌యాదవ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మమత, యశ్వంత్, క్రీడాకారుడు రాసకొండ సంజీవ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన ఎంపీ రేణుకా చౌదరి దంపతులను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు సంరెడ్డి భుజంగారెడ్డి, తదితరులు - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

నీటి బిల్లుల జారీలో గందరగోళం

● నెలల తరబడి జాప్యం ● ఫోన్ యాప్ తెచ్చినా ఫలితం శూన్యం



మీటర్ రీడింగ్ ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్న రీడర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు జారీ చేస్తున్న నీటి బిల్లులు గందరగోళంగా మారాయి. మీటర్ రీడర్లతో బిల్లులు జారీ చేస్తే సమస్యలు తలెత్తుతున్నాయని భావించి ఫోన్ యాప్ తీసుకొచ్చినా ఫలితం ఉండడం లేదు. మీటర్ రీడర్ నల్లా మీటర్ ఫొటో తీసి వాటర్ బోర్డు ఫోన్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా బిల్లులు సక్రమంగా రావడం లేదు. నెలల తరబడి ఆలస్యం చేయడంతో పాటు ఇష్టానుసారంగా బిల్లులు వేస్తున్నారు. అడ్డగోలుగా వస్తున్న బిల్లులను ఏ విధంగా చెల్లించాలని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలుప్రాంతాల్లో వాటర్‌బోర్డు నీటిసరఫరాతో పాటు బిల్లులు వసూలు చేస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని గృహ కనెక్షన్లకు నెలకు 20 వేల లీటర్ల వరకు తాగునీటిని ఉచితంగా అందిస్తున్నారు. అంతకు మించి నీటిని వినియోగిస్తే బిల్లులు జారీ చేస్తున్నారు. ఇందుకోసం నీటి మీటర్లే ప్రామాణికంగా మారాయి. మెకానికల్ నీటి మీటర్‌తో సమస్యలు వస్తున్నాయని వాటి స్థానంలో ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) మీటర్లను తీసుకొచ్చారు. గతంలో మీటర్ రీడర్లు ఇంటింటికీ వెళ్లి వీటిలో వచ్చే రీడింగ్‌ను ఈ-పాస్ మిషన్లలో నమోదు చేసి బిల్లు ఇచ్చేవారు. మీటర్ రీడర్లు తక్కువ రీడింగ్ నమోదు చేసి అవకతవకలకు పాల్పడుతున్నారని భావించి మొబైల్ యాప్ తీసుకొచ్చారు. మీటర్ రీడర్ ఇంటింటికీ తిరిగి ఏఎంఆర్ మీటర్ రీడింగ్‌ను ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. డీజీఎం స్థాయి అధికారులు డివిజన్ల వారీగా మీటర్ రీడింగ్‌ను పరిశీలించి బిల్లు వేస్తారు. ఆ బిల్లును ఆన్‌లైన్‌లోనే పొందాల్సి ఉంటుంది. లేకుంటే మీటర్ రీడర్ మరోసారి రీడింగ్‌కు వచ్చినప్పుడు ఇస్తారు.

మీటర్ రీడర్ ఫొటో తీసి పంపినా బిల్లు రావట్లేదు

కమర్షియల్, గృహ కనెక్షన్ల మీటర్ రీడింగ్‌లను రీడర్లు ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నా అధికారులు వెంటనే పరిశీలించడం లేదు. రెండు, మూడు నెలల బిల్లులు ఒకేసారి ఇస్తున్నారు. చెల్లించకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు. దాంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మీటర్ రీడింగ్ కంటే అధికంగా బిల్లులు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో తమకు ప్రతి నెలా బిల్లు వచ్చేదని, ప్రస్తుతం రెండు, మూడు నెలలకోసారి ఇస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో గ్రామ పెద్దలు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్‌లోని భూనీల సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేంకటేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బీమగోని భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్ ముద్దం స్వరూపవీరస్వామియాదవ్, ఆలయ చైర్మన్ సంపత్‌గౌడ్, బీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్ధన్, శ్రీనివాస్, పోచయ్య, వెంకటేష్, రాజు, బ్రహ్మచారి పాల్గొన్నారు.

బీసీ కులగణనపైన అసెంబ్లీలో తీర్మానంపై హర్షం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల గణన చేపట్టేందుకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి, ఏకగ్రీవంగా ఆమోదించటం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల దాటినా సమగ్ర కుల గణన జరగలేదని, దేశ సంపద అన్ని వర్గాల వారికి చేరాలన్న లక్ష్యం నెరవేరటం లేదన్నారు. బీసీల ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అభివృద్ధి కోసం కులగణన చేపట్టడం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎండీ ఖాజామియా, మారేపల్లి కుమార్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.



పార్వతమ్మకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్, మేయర్ పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్ కార్పొరేటర్‌కు మాతృవియోగం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి తల్లి పార్వతమ్మ(70) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. ఆరోగ్యం మరింత క్షీణించడంతో గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆమె మరణవార్తను తెలుసుకున్న కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు ఆమె పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వ్యవసాయ పద్ధతులను అభివృద్ధి చేయడంలో

డిజిటల్ టెక్నాలజీల ప్రాముఖ్యత అవసరం

● ఐసీఏఆర్ సెక్రెటరీ, డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పాఠక్



జాతీయ సెమినార్‌లో మాట్లాడుతున్న డా. హిమాన్షు పాఠక్

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పద్ధతులను అభివృద్ధి చేయడంలో డిజిటల్ టెక్నాలజీల ప్రాముఖ్యత అవసరమని ఐసీఏఆర్ సెక్రెటరీ, డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పాఠక్ అన్నారు. సుస్థిర వ్యవసాయం పర్యావరణం కోసం స్మార్ట్ టెక్నాలజీస్ పై ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆగ్రో ఫిజిక్స్ ఢిల్లీ, సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్ క్రీడాలో సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్‌ను ఐసీఏఆర్ సెక్రెటరీ, డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పాఠక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సవాళ్లకు పరిష్కారాలను అందించడంలో కొత్త సాంకేతికలు ఎలా సహాయ పడతాయి, సుస్థిర వ్యవసాయం కోసం ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆగ్రో ఫిజిక్స్(ఐఎస్ఏపీ) యొక్క కీలక పాత్ర గురించి రైతులకు, విద్యార్థులకు వివరించారు. పర్యావరణ సుస్థిరతలను కొనసాగిస్తూ వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి సాంకేతిక పురోగతులు, వినూత్న విధానాలు అవసరమన్నారు. ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డా. జాక్వెలిన్ హ్యూస్ మాట్లాడుతూ డ్రైల్యాండ్ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను, పొడి భూముల రైతులకు ప్రయోజనం చేకూర్చే వాతావరణ -స్మార్ట్ టెక్నాలజీల ఉపయోగం గురించి అభిప్రాయపడ్డారు. వ్యవసాయంలో వివిధ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తలు ఆహార ఉత్పత్తికి సంబంధించిన ప్రతి అంశంలో విస్తరించి ఉన్నారన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను నిలకడగా పెంపొందించడానికి జీఐఎస్, రిమోట్ సెన్సింగ్, జీపీఎస్, ఉపగ్రహాల వంటి స్పేస్ అప్లికేషన్ టెక్నాలజీలను ప్రెసిషన్ ఫార్మింగ్ కలిగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ క్రీడా డైరెక్టర్ వి.కె సింగ్, ఐసీఏఆర్- నారమ్ డైరెక్టర్ డా.శ్రీనివాసరావు, డా. ఎస్.కె చౌదరి శాస్త్రవేత్తలు, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఐసీఏఆర్ క్రీడాలో శాస్త్రవేత్తలు

కంటి ఆపరేషన్లు



ఉచిత కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులతో సంఘం అధ్యక్షుడు గోపీశంకర్‌యాదవ్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో ధనలక్ష్మి ఆప్టికల్స్ సహకారంతో 15మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు సంఘం అధ్యక్షుడు కిక్కెర గోపీశంకర్‌యాదవ్ తెలిపారు. ఇటీవల అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో సంఘాన్ని ఆశ్రయించిన వివిధ జిల్లాలకు చెందిన పేదలకు సికింద్రాబాద్‌లోని పుష్పగిరి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు ఆయన పేర్కొన్నారు. రెండేళ్లుగా సంఘం ఆధ్వర్యంలో 127మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ధనలక్ష్మి ఆప్టికల్స్ ఆప్టోమెట్రిస్ట్ రాజేష్‌గౌడ్, సభ్యులు రఘువీర్ పాల్గొన్నారు.

విశ్వప్రకాష్‌బాబుకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న విశ్వప్రకాష్‌బాబు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు కుంట్లూర్ పరిధిలోని పల్లవి కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం హెచ్‌ఓడీగా పని చేస్తున్న విశ్వప్రకాష్‌బాబు పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ఆప్టిమల్ కంట్రోలర్స్ ఫర్ వోల్టేజ్ కంపెన్సేషన్ యూజింగ్ సోలార్ ఫెడ్ డైనమిక్ వోల్టేజ్ రిస్టోరర్ సిస్టం' అనే అంశంపై సమర్పించిన పరిశోధన వ్యాసానికి క్రెసెంట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను సాధించారు. మూడు రోజుల క్రితం చెన్నయ్‌లోని డాక్టర్ బీఎస్ అబ్దుల్ రెహమాన్ క్రెసెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ యూనివర్సిటీలో నిర్వహించిన కాన్వకేషన్ కార్యక్రమంలో విశ్వప్రకాష్‌బాబు డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా విశ్వప్రకాష్‌బాబును కళాశాల చైర్మన్ మల్కా కొమురయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ రాజు, అకాడమిక్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ స్వామి, రాజేందర్‌రెడ్డి, ఏఓ అంబాల శ్రీధర్ అభినందించారు.

వైష్ణవీ ప్రసాద్‌కు టీబీఎస్ఎస్ఎస్ మద్దతు



సమావేశంలో టీబీఎస్ఎస్ఎస్ ప్రతినిధులు

కొత్తపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్‌కు తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) మద్దతు ఇస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు వెన్నెంపల్లి జగన్మోహన్ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. గురువారం సమాఖ్య ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడుతూ త్వరలో ప్రాంతాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని, కార్యచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు రఘునందన్, బనగిరి నాగరాజ్, పప్పు సుబ్బారావు, ప్రభాకర్‌మూర్తి, గిరిజాకుమారి, రవిప్రసాద్ పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ ఎస్ అండ్ డబ్ల్యూ

సెక్రెటరీ జనరల్‌గా హన్మంతుముదిరాజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ జనరల్‌గా కె.హన్మంతు ముదిరాజ్‌ను నియమించినట్టు ఐఎన్‌టీయూసీ కేంద్ర అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి తెలిపారు. రాష్ట్ర రోడ్ రవాణా సంస్థలో ఐఎన్‌టీయూసీ లక్ష్యాలకు అనుగుణంగా కార్మికుల మధ్య ఐక్యతను పెంచి సంఘం పటిష్టత కోసం ప్రతిపాదించిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సంజీవరెడ్డి ఈ సందర్భంగా హన్మంతు ముదిరాజ్‌కు సూచించారు. 2017, 2021 పీఆర్‌సీల అమలు కోసం పోరాడుతామని పేర్కొన్నారు.

బధిరుల పాఠశాలకు టీసీపీసీ భవనం కేటాయింపుతోనే 'వీల్ చైర్స్' తరలించాం

● ఎస్సీ, టీజీపీ విభాగం డీఈపీడబ్ల్యూడీ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్

ఎల్‌బీనగర్/మన్సూరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని టీసీపీసీ భవనంలో తాత్కాలికంగా నిల్వ చేసిన వీల్ చైర్లను శామీర్‌పేటలోని ఓ ప్రైవేటు భవనంలోకి తాత్కాలికంగా తరలించామని ఎస్సీ, టీజీపీ విభాగం డీఈపీడబ్ల్యూడీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.రాజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలో దివ్యాంగుల కోసం వీల్ చైర్లను ఉపయోగించిన అనంతరం వాటిని దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయం (టీసీపీసీ) భవనంలో నిల్వ ఉంచి, అక్కడి నుంచి కూడా మళ్లీ తరలింపు విషయంపై.. 'దివ్యాంగుల వీలు చైర్ల తరలింపు' శీర్షికన ఈనెల 14న 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. దీనిపై స్పందించిన రాజేందర్.. గురువారం ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ జిల్లాలోని 3977 పోలింగ్ కేంద్రాలకు గానూ దివ్యాంగులు, వృద్ధుల కోసం 3696 వీల్ చైర్స్‌ను కేటాయించారన్నారు. వాటిని జిల్లాలోని 15 నియోజకవర్గాలకు పంపిణీ చేశామన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత మలక్‌పేటలోని టీసీపీసీ గదులలోకి తాత్కాలికంగా నిల్వచేయడం జరిగిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకు సదరు భవనంలోనే ఉంచామన్నారు. అయితే సదరు టీసీపీసీ భవనాన్ని బధిరుల పాఠశాలకు కేటాయించటంతో, ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సూచనతో అందులోని వీల్ చైర్స్‌ను ఇతర చోటకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో శామీర్‌పేటలోని ఓ ప్రైవేటు భవనంలోకి తాత్కాలికంగా తరలించామన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆ వీల్ చైర్స్‌ను వినియోగించి.. అనంతరం ఎలక్షన్ కమిషన్‌కు అప్పగిస్తామని రాజేందర్ వివరించారు.

'విక్షిత్ భారత్ విక్షిత్ రైల్వే' పోటీల్లో నాలుగు రాష్ట్రాల విద్యార్థులు

● 26న విజేతలకు ప్రధాని చేతుల మీదుగా బహుమతుల ప్రదానం

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో గురువారం '2047-విక్షిత్ భారత్ విక్షిత్ రైల్వే' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వ పోటీల్లో 37,351 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భారతీయ రైల్వేలపై అవగాహన పెంచాలనే లక్ష్యంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలోని 269 పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు. ప్రధానంగా హైదరాబాద్ డివిజన్ పరిధిలోని 60 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 7,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు సికింద్రాబాద్ డివిజన్‌లోని 42 పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో 5326 మంది విద్యార్థులు పాల్గొనగా 126 మంది వివిధ విభాగాల్లో విజేతలుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ డివిజన్‌లో 55 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 11,235 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గుంటూరు డివిజన్‌లోని 25 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 3010 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. గుంతకల్ డివిజన్ పరిధి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లోని 39 పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో 6780 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మహారాష్ట్ర నాందేడ్ డివిజన్ పరిధిలోని 48 పాఠశాలల్లో జరిగిన పోటీల్లో 3,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిల్లో గెలుపొందిన విద్యార్థులకు ఫిబ్రవరి 26న ప్రధాని నరేంద్రమోదీ బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తారని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలియజేశారు.

హత్యకు దారి తీసిన వివాహేతర సంబంధం

● ప్రియురాలి సంబంధీకులే హత్య చేశారని అనుమానం

ఉప్పల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఓ వ్యక్తి హత్యకు దారి తీసింది. ఈ సంఘటన బుధవారం రాత్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జెన్‌పాక్ట్ వెలుగుగుట్ట సమీపంలో చోటుచేసుకుంది. ఉప్పల్, ఆదర్శనగర్‌లో నివాసముంటున్న సాయికుమార్ (43) స్థానికంగా పాతకార్లు కొని అమ్మే వ్యాపారం చేస్తున్నాడు. ఇతడు అవివాహితుడు. వదిన వరుసైన మహిళతో కలిసి కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఆమెకు వివాహం కాగా భర్త మృతి చెందాడు. ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. ఇటీవల ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆ మహిళ సాయికుమార్‌కు ఫోన్ చేసి ఉప్పల్ జెన్‌పాక్ట్ సమీపంలోని వెలుగుగుట్ట వద్దకు రావాలని కోరింది. అక్కడికి చేరుకున్న సాయికుమార్‌ను ఆమెతో వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో గాయపరచారు. వారి నుంచి కాపాడుకునేందుకు సాయికుమార్ పరుగెత్తుకుంటూ జెన్‌ప్యాక్ట్ మెయిన్‌రోడ్డు వరకు వచ్చాడు. ఈలోగా సోదరుడు సాయికిరణ్‌కు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా అతడు 108 అంబులెన్స్ సహాయంతో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. తీవ్రగాయాలైన సాయికుమార్ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందారు. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

● తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ డిమాండ్

అఫ్జల్‌గంజ్/మంగళ్‌హట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సుర్వీ యాదయ్య డిమాండ్ చేశారు. గురువారం నాంపల్లిలోని గన్‌పార్కు వద్ద తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో సర్పంచులు నిరసన చేపట్టారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన యాదయ్య... తెలంగాణలో గ్రామాలను దేశం గర్వించేలా తీర్చిదిద్దిన ఘనత సర్పంచులదేనన్నారు. అప్పులు తీసుకొచ్చి మరి గ్రామాల్లో సీసీ రోడ్లు, రైతువేదికలు, శ్మశానవాటికలు నిర్మించి గ్రామాలను అభివృద్ధి చేశామని, ఇప్పుడు పదవీకాలం పూర్తయినా బిల్లులు విడుదల చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ కూడా సర్పంచులను మోసం చేయాలని చూస్తుందని, అధికారంలోకి రాగానే ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు మొహం చాటేస్తుందన్నారు. ప్రజాపాలనపై చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నామినేషన్లు దాఖలు చేసి పోటీలో నిలుస్తామని హెచ్చరించారు.

ఓయూలో పూలే విగ్రహావిష్కరణ

తార్నాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే రీసెర్చ్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని గురువారం ఓయూ వీసీ డా. రవీందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, సామాజిక న్యాయం, సమానత్వం కోసం పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం పూలే రీసెర్చ్ సెంటర్ బీసీ సెల్ డైరెక్టర్ డా. సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో సమగ్ర, సాధికారతే లక్ష్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ, ఓఎస్‌డీ బి. రెడ్యానాయక్, మైనార్టీ సెల్ డైరెక్టర్ సయ్యద్ అజీమ్ ఉన్నిసా, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డా. మంగు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786